# శ్రీ రమణ జ్యోతి
అక్టోబర్ 2019
ఈ సంచికలో ...

# Sri Ramana Jyothi
October 2019
IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| 1. | **డా॥ కే.యస్. గారి 63వ ప్రవచనం** | డా. వి. రామదాస్ మూర్తి | **3** |
| 2. | **భగవాన్ రమణ మహర్షి** | కమలాకర వేంకటరావు | **8** |
| 3. | **శ్రీ భగవాన్ సేవలో** | జి. శ్రీహరి రావు | **11** |
| 4. | **శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు** | మల్లాది ఫణిమాల | **18** |
| 5. | **శరణాగతి - అంతరార్థం** | తాడిమేటి సత్యనారాయణ | **24** |
| 6. | **"Reflect On My Teachings and Do What You Like!"** | Dr.K.Subrahmanian | **30** |
| 7. | **The Malai Is Where You Are!** | Smt. Manaswini | **34** |
| 8. | ***Lest We Forget* - Sri K. Ramkishan** | A.V. Ramanaiah | **36** |
| 9. | **Kavyakantha's Chatvarimsat** | V. Krithivasan | **38** |
| 10. | **We Are Chosen by Atman** | V. Ganesan | **42** |
| 11. | **Saints of Periapuranam Enadinatha Nayanar** | | **49** |


## Events in Sri Ramana Kendram in October

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 12th October - (Every 2nd Saturday of the month) Uma Sahasram recitation from 12.00 noon - 5.00 p.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
4. 21st October - Punarvasu Satsang - 6.00 - 7.15 p.m.


© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyoti either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.



**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు : కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**


# దైవ సంకల్పాన్ని ఊహించలేము


డా॥ కే.యస్. గారి 63వ ప్రవచనం
అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి


## అనుభవాలను పంచుకోవాలి

మనమందరమూ ఇతరుల అనుభవాల నుండి ఎన్నో విషయాలను తెలుసుకుంటాం. ముఖ్యంగా, అవతలివారికి ఎదురైన కొన్ని సంఘటనలు, ఆధ్యాత్మికంగా వారు అనుకోని అనుభవాలను గురించి తెలిసినప్పుడు సంతోషించడమే గాకుండ మనకు దైవం మీద విశ్వాసం పెరుగుతుంది. ఇతరుల సంతోషంలో పాలు పంచుకున్నప్పుడు మన సంతోషం రెట్టింపు అవుతుంది. అలాగే కష్టాలను పంచుకుంటే దుఃఖం సగమౌతుంది. ఎందుకంటే ఎదుటివాళ్ళు మనపట్ల సానుభూతి చూపినప్పుడు కష్టాన్ని, మరియు దుఃఖాన్నీ పంచుకుంటారు. ఇటీవల మన కేంద్రంలో చిరకాల భక్తుడు శ్రీ పి. రాఘవేందర్‌గారికి అనుకోని ఆనందమైన అనుభవం కలిగింది. వారి మాటల్లో ఆ సంఘటన గురించి శ్రీ రాఘవేందర్ చెబుతారు:

“చాలా ఏళ్ళనుండి మా కుటుంబం శ్రీ చినజీయర్‌స్వామి గారి పట్ల భక్తిశ్రద్ధలు కనబరుస్తోంది. ముఖ్యంగా మా తల్లిగారికి గురువుగారి దర్శనం చేసుకుని, వీలైతే స్వామివారిని ఇంటికి ఆహ్వానించి, కృతార్థులం కావాలన్న చిరకాల వాంఛ వుండేది. ఆ మధ్య ఉగాది సందర్భంగా ఖమ్మంలో మరొక భక్తుడు శ్రీ నరేష్ కుమార్ గారి ప్రత్యేక వినతితో వారి ఇంటికి శ్రీ జీయర్ స్వామిగారు రావడం జరిగింది. తమ నూతన గృహంలో మొట్టమొదట శ్రీ స్వామిగారు తమ పాదపద్మాలను మోపాలని

నరేష్ కుమార్ కోరుకున్నారు. అక్కడి కార్యక్రమాలు ఆలస్యమయ్యాయి. హైదరాబాద్‌కు వచ్చి రాత్రి ఫ్లైట్‌లో చెన్నై వెళ్ళాలన్నది స్వామివారి అసలు ప్రణాళిక, హైదరాబాద్‌లో ఆగే ఉద్దేశం లేదు.

ఉదయమే ఖమ్మం నుండి శ్రీ నరేష్‌కుమార్ గారి కారులో బయలుదేరి వస్తుండగా మధ్యలో ప్రమాదానికి గురైన కారు రోడ్డు ప్రక్కకు పడిపోవడం జరిగింది. అదృష్టవశాత్తు, ఎవరికీ ఏ గాయాలు కాలేదు. తిరిగి సర్దుకుని వచ్చేసరికి హైదరాబాద్ ఆలస్యంగా చేరారు. విమాన ప్రయాణానికి ఆలస్యం అయింది. ప్రక్కరోజు ప్రొద్దుట మాత్రమే తరువాతి విమానం చెన్నైకి వుంది. స్వామివారు తమ మఠంలో మకాం పెట్టారు. అప్పుడు అనుకోని రీతిలో నాకు, డా. కె.ఎస్.గారికి శ్రీస్వామిజీ దర్శనం జరిగింది. అంతకంటే విచిత్రంగా అక్కడ జరిగిన సంభాషణల సందర్భంగా, ఎంతో కాలం నుండి మా కుటుంబం స్వామిగారిని మా గృహానికి ఆహ్వానించాలన్న కోరిక తెలపడం జరిగింది.

స్వామిగారు ఎంతో దయతో, ఉదారంగా, తాము అప్పుడున్న చోటికి మా ఇల్లు దగ్గరే వుంటే అట్లాగే వస్తామని దయతో సెలవిచ్చారు. మా ఆనందానికి హద్దుల్లేవు. అలాగ స్వామీజీ మా ఇంటికి దయచేయడంతో మా తల్లి బ్రహ్మానందంతో ఉబ్బితబ్బిబ్బు అయింది. ఆనవాయితీ ప్రకారం స్వామిగారికి సత్కారాలు పూర్తి అయిన తరువాత మా తల్లి "తనకు ఏమీ తెలియదనీ, తనను ఆశీర్వదించాలి" అని కోరారు. స్వామిగారు చిరునవ్వుతో, "చాలా మందికి తమకేమీ తెలియదన్న ఎఱుక వుండదు. అది ఎంతో గొప్పది. మీ విషయంలో మీరు ఏ ఆశా వదులుకోనక్కర లేదు.



అంతా బాగా జరుగుతుంది" అని ఆశీర్వదించారు. ఆ తరువాత స్వామీజీ లక్ష్మీనారాయణ అనే మరొక భక్తుని ఇంటికి కూడ దయచేశారు, ఆ విధంగా అనుకోకుండ మా చిరకాల కోరిక తీరింది" అని శ్రీ రాఘవేందర్ ముగించారు.

(ఆ తరువాత డా. కె.ఎస్.గారు తమ ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఇలాగ చెప్పారు)

ఇలాంటి సంఘటనల వల్ల అసాధ్యమని అనుకొన్నవి కూడ సాధ్యమౌతాయి. ఈ ఉదంతం నుండి గ్రహించవలసిన పలు విషయాలున్నాయి. శ్రీ రాఘవేందర్ చెప్పినట్లుగా స్వామీజీ ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి లోనుకావడం వల్ల వారు హైదరాబాదుకు ఆలస్యంగా రావడం, ఇక్కడ మకాం చేయడం సంభవించింది. అంతకు ముందు, ఆ తరువాతి సంఘటనలు ఎంతో నాటకీయంగా జరిగాయి. నరేష్ కుమార్ గారికి కారు నడపడంలో మంచి అనుభవం వున్నప్పటికీ, ప్రమాదం జరిగింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీ కాలేదు. స్వామీజీ అనుకోకుండ హైదరాబాద్‌లో వుండి పోవలసి వచ్చింది. పరోక్షంగా అది ఎన్నో ఆశ్చర్యకరమైన ఫలితాలకు దారి తీసింది.

## ఊహించలేని ఫలితాలు

పై సంఘటనలు అప్పటికి నాకు తెలియవు. కేశవరెడ్డి గారు విషయాలు తెలుసుకుని స్వామి వారి దర్శనం చేసుకున్నారు. మాటల సందర్భంలో స్వామీజీ నన్ను గురించి అడిగారట. స్వామీజీకి సమయం వుంటే నన్ను వారి సన్నిధికి తీసుకు రమ్మంటారా అని కేశవరెడ్డి గారు అడిగినప్పుడు, నన్ను కలవాలని

స్వామివారు అన్నారట. ఆ విషయం కేశవరెడ్డి నాకు ఫోన్‌లో చెప్పారు. అంతలో ఆయనకు మరొక ముఖ్యమైన పని రావడంతో తాను నాతో రాలేకపోవచ్చునన్నారు. స్వామీజీ రమ్మన్నందు వల్ల నేను వెళ్ళాలని నిశ్చయించుకున్నాను.

నాకు కళ్ళ సమస్యలు వున్న కారణం వల్ల కంటివైద్యులు డాక్టర్ నరసింహారావుగారు అనే కేంద్రం భక్తులు నన్ను ఒంటరిగా బయటకు వెళ్ళవద్దనీ, వెళ్ళవలసి వస్తే, ఎవరినైన వెంట తీసుకు వెళ్ళమని సలహా ఇచ్చారు. కేంద్రం చిరకాల భక్తులు శ్రీ రమణయ్య గారు కూడ అదే మాట చెబుతుండేవారు. కాని ఆ సమయానికి వారిద్దరికీ నాతో రావడం కుదరలేదు. అందుకే ఆ పరిస్థితుల్లో శ్రీ రాఘవేందర్ గారితో మాట్లాడితే, తాము నన్ను తీసుకెళ్తామన్నారు. మిగత సంగతులన్నీ రాఘవేందర్‌గారు ఇప్పుడే చెప్పారు.

ఇలాంటివన్నీ మనం ఊహించలేనివైన సంకల్పాలే. కారులో స్వామీజీ వున్నప్పుడు ఆ ప్రమాదం జరగడం, ఎవరికీ ఏ హానీ కలగకపోవడం ఒకటి. అలా ఆలస్యంగా హైదరాబాద్ చేరడం వల్ల ఇక్కడ స్వామీజీ మకాంచేసి, రాఘవేందర్, లక్ష్మీనారాయణ గార్ల ఇళ్ళను దర్శించడానికి మార్గం ఏర్పడింది. మనకు ఇవి అర్థం కావు. బహుశః రాఘవేందర్‌గారి తల్లి యొక్క గాఢమైన భక్తి, నమ్మకం కారణం కావచ్చు.

మన మనస్సు విషయాలను సంపూర్ణంగా అవగాహన చేసుకోనివ్వదు. ప్రపంచంలో జరిగే అన్ని విషయాల పరిణామాలు ఖండాలుగా మాత్రమే మనం గ్రహించడం వల్ల, ప్రతీదీ మన మంచికే అన్న అసలు సత్యం మన ఎఱుకలోకి రాదు. ఒకటి



మంచిది, మరొకటి మంచిది కాదు అన్న అభిప్రాయాన్ని ఆ విషయం వల్ల మనకూ మన వాళ్ళకూ కలిగే ఫలితాన్ని అంచనా వేసి నిర్ణయానికి వస్తాము. అందుకే ప్రస్తుత ఉదంతం వంటి ప్రతి సంఘటన వెనుక ఏదో ప్రయోజనం వుంటుందన్న యథార్థం మన ఆలోచనలకు అతీతంగా వుంటుంది.

*(ఇప్పటికే ఎంతో ఆలస్యమైనప్పటికీ, పాఠక భక్తులకు ఒక ముఖ్య విషయం చెప్పాల్సి వుంది. డా. కే.ఎస్.గారు తాము ఊళ్లో వున్నంతకాలం, తమ ఆరోగ్యాన్ని కూడ ప్రక్కకు పెట్టి ప్రతి ఆదివారం శ్రీరమణకేంద్రలో జరిగే సత్సంగాలలో తమ అద్భుత ప్రసంగాలను చేస్తూనే వచ్చారు. గొప్ప విశేషమేమిటంటే కేంద్రం లోని రమణ భక్తులు, శ్రీ పులిజాల రాఘవేందర్‌గారు, డా. కె.ఎస్. చేసిన ప్రతి ప్రవచనాన్ని రికార్డు చేసి, మొదట టేప్‌లు, తరువాత సి.డి.లుగా తయారు చేసి మొత్తం రమణ భక్తులందరికి ఎనలేని సేవ చేశారు. అలాగే కేంద్రంలోని మరొక భక్తురాలు శ్రీమతి స్నేహ చౌధరీ గారు ఎంతో శ్రమకు ఓర్చి, ఆ సి.డి.ల నుండి ఇంగ్లీషు టైప్ ప్రతులను అనువాదం కోసం అందజేస్తున్నారు. ఆమె చేసిన ఈ సేవ కారణంగానే, శ్రీ తాడిమేటి సత్యనారాయణ గారు గాని, నేను గాని డా. కె.ఎస్. గారి ప్రవచనాల తెలుగు అనువాదాన్ని అందించ గలుగుతున్నాము. ఈ సంచికతో కలుపుకొని, 63 ప్రవచనాలు శ్రీరమణ జ్యోతిలో ధారావాహికంగా ప్రచురించే భాగ్యం కలిగింది. ఈ పత్రిక పాఠకులందరి తరపున శ్రీ రాఘవేందర్‌గారికి, శ్రీమతి స్నేహ చౌధరీ గారికి మా కృతజ్ఞాతాభివందనలను తెలియజేసుకొంటున్నాం. - సంపాదకుడు)*

# భగవాన్ శ్రీ రమణ మహర్షి

(గత సంచిక తరువాయి) కమలాకర వేంకటరావు

శ్రీ రమణుల సన్నిధి శాంతిసంధాయకమూ, సంశయ విచ్ఛేదకమూ అనే మాట సర్వసామాన్యంగా అందరూ అనుభవపూర్వకంగా చెప్పుకుంటూ వుండేవారు. నిత్యమూ ఆత్మస్థుడై ఉండేవాని పరిసరాలు శాంతితరంగాలతో నిండివుండడం సహజమే. ఆత్మస్థులై వుంటూనే శ్రీరమణులు భక్తుల ననుగ్రహింపగోరి సర్వసులభులై అందరితో కలసి మెలసి తిరుగుతూ వారి ప్రశ్నలకు వాగ్రూపమున గూడ చక్కని సమాధానము లిచ్చి వారికి జ్ఞానోపదేశం చేస్తూ వుండేవారు. భారతదేశం నలుమూలల నుండే కాక, విదేశాల నుండి సైతం వచ్చిన యాత్రికులతో శ్రీరమణులు సల్పిన యిష్టాగోష్ఠులను 1935-39 మధ్య నాలుగు సంవత్సరాల పాటు శ్రీ మునగాల వెంకటరామయ్యగారు (పిమ్మట వీరు ఆశ్రమ స్వీకారం చేసి శ్రీరమణానంద సరస్వతీ స్వాములవారైనారు) శ్రద్ధతో వ్రాసివుంచగా రూపొందినదే Talks with Sri Ramana Maharshi అనే గ్రంథం. ఈ చిన్ని పొత్తంలోని రమణ సూక్తులన్నీ ఆ గ్రంథరాజం నుండి ఎన్నికచేసి అనువదించబడినవే.

ప్రతి మానవునిలోనూ 'నేను', 'నేను' - అని అంటూ వుండేది ఒకటి ఉండడం అందరికీ అనుభవసిద్ధమే. ఆ 'నేను' కు మూలం తెలుసుకోమన్నదే మహర్షి చేసిన బోధకు ముఖ్య సారాంశం.



అహంకారరూపమైన 'మాయ నేను'ను వదలి దానికి మూలంలో ఉన్న 'అసలు నేను'ను పట్టుకోవాలి. సుషుప్త్యవస్థలో అహంకార మడగి 'అసలు నేను' భాసిస్తున్న మాట నిజమే కాని, అది తెలియబడడం లేదు. జాగ్రత్తులో నుండియే దానిని తెలుసుకోవాలి. 'నేను'కు మూలాన్ని అన్వేషించడమే దానికి సూటి మార్గం. ఆత్మ గురుబోధచే అది శ్రీరమణమహర్షి పదునారేండ్ల వయస్సులోనే తెలుసుకున్నారు. ప్రహ్లాదుడు తండ్రికి చెప్పినట్లు, ఇది 'చదువులలో మర్మం' తెలుసుకోడమే కాని వేరు కాదు. సకల శాస్త్రముల పరమ లక్ష్యమూ, సకల సాధనల పరమ గమ్యమూ దీనిని తెలుసుకోవడమే.

ఈశ్వర సాక్షాత్కారం, బ్రహ్మసాక్షాత్కారం అనే వాటికి కూడ ముఖ్య కీలకం ఈ ఆత్మసాక్షాత్కారమే. దేనిని తెలుసుకున్నా ఆత్మ ద్వారముననే తెలుసుకోవలసి వుంటుంది. బ్రహ్మము నేననే అనుభూతి కూడ ఆత్మయందే పొందవలసి వుంటుంది. కనుక ఆత్మ నిజస్వరూపమేమిటో తెలుసుకోడం, అనగా 'అసలు నేను' ను తెలుసుకోడం తలపుల కన్నింటికీ మూలం. ఎవరికైనా ఆత్మ కంటె - అనగా తనకంటె తనకు సన్నిహితమైన వస్తువేదీ లేదు. అయినా అజ్ఞానం చేత మానవుడు తనకు తానే దూరమైపోతున్నాడు. జ్ఞానం చేతనే ఆ దూరాన్ని దాటవలసి వున్నది. 'మాయ నేను' మూలాన్ని ఎరుకతో వెదకడంకంటె అందుకు దగ్గర దారి మరిలేదు. ఈ పరమరహస్యాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకున్న

శ్రీరమణులు దానినే ఎలుగెత్తి లోకానికి చాటారు. ఆ అనుభవంతో ఆత్మస్థుడై చెప్పినమాట కాబట్టి అది మహాప్రభావసంపన్నమై విరాజిల్లింది.

శ్రీరామకృష్ణ పరమహంస మహోన్నతమైన ఆధ్యాత్మిక సత్యాలను చక్కని కథలలో పొదిగి బోధించేవారు. శ్రీరమణమహర్షి బోధించే సూటిపద్ధతి మరొక రకం. ఇరువురూ తమ తమ పద్ధతుల యందు తమకు తామే సాటి. జ్ఞానాంజనశలాకలవంటి శ్రీరమణ మహర్షి బోధలు ఎవరిని ఉత్తేజితులను గావింపవు? బోధలు పూర్ణ ఫలితము లివ్వడానికి దైవానుగ్రహం కావాలి. భగవాన్ శ్రీరమణ మహర్షి భౌతిక కాయంతో ఈ భూమిపై తిరుగాడిన కాలంలో అట్టి అనుగ్రహరూపంగా కూడ విరాజిల్లారు. అమృత స్వరూపుల అనుగ్రహం శరీర త్యాగానంతరం కూడ ఉండేదే - ఎక్కడికి పోదు.

## అంతర్ముఖత్వ సాధన

**మహావాక్యాలూ, వాటి అర్థ నిర్ణయాలూ అంతులేని చర్చలకు దారితీసి సాధకుల మనస్సులను బహిర్ముఖంగా ప్రసరింపజేస్తూ వుంటాయి. మనస్సును అంతర్ముఖం చెయ్యాలంటే సాధకుడు సూటిగా 'నేను'లో నిలకడ సంపాదించుకోడం అవసరం. బాహ్య ప్రవృత్తు లంతరించి అతని కపుడు పరమశాంతి చేకూరుతుంది.**



# శ్రీ భగవాన్ సేవలో

*(గత సంచిక తరువాయి)*

- శ్రీ జి. శ్రీహరిరావు

### *శ్రీ టి.ఎన్. వెంకటరామన్ (స్వామి రమణానంద)*

### 1. శ్రీ భగవాన్ నాకు నేర్పిన మొదటి పాఠం:

శ్రీ అరుణాచల పర్వతం తూర్పుభాగంలో కట్టబడిన ఒక పాకలోని గది కటకటాల కిటికీలో ఒక పళ్ళెంనిండా కొన్ని మిఠాయిలు పెట్టబడి వున్నాయి. ఆ గదిలో ఒక మూల అలిసిపోయిన ఒక వృద్ధురాలు పడుకొని వున్నారు. ఆమె దగ్గరనే ఒక ఐదేళ్ళ బాలుడు కూర్చొని అటూ, ఇటూ చూస్తున్నాడు. కొద్దిసేపటికి లేచి, నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళి, తన పసి చేతులతో ఒక మిఠాయి తీసుకొని నోట్లో పెట్టుకున్నాడు.

అకస్మాత్తుగా కిటికీ తెరుచుకొని ఒక కోతి కుంటుకుంటూ వచ్చి ఆ బాలుడిని చెంపపై కొట్టింది. ఆ మిఠాయి లాక్కొని కొరికింది. ఆ బాలుడు భయపడి, నిశ్చేష్టుడై ఒక కేక పెట్టాడు. ఆ వృద్ధురాలు లేచి, కంగారుపడి, "ఓరి కుంటీ! బాబు మన వాడురా! వాడికి హాని చేయకు" అని అరిచారు.

ఆమె ఈ మాటలు అంటుండగానే, గోచీ పెట్టుకున్న ఒక సాధువు మధురమైన చిరునవ్వుతో లోపలకు వచ్చారు. బాలుడి వంక చూసి, "నిన్ను కొట్టాడా? నీకు అది మంచి గుణపాఠం. పళ్లెంలోని పళ్ళూ, మిఠాయిలూ నొండికి చెందుతాయి. నువ్వు రోజూ చూస్తున్నావు కదా! వాడికి చెందిన మిఠాయి నువ్వు తీసు

కోవడం తప్పు కదా! ఎపుడూ ఇతరులకు చెందిన వస్తువులను మనం తీసుకోకూడదు. అర్థమైందా?'' అని మందలింపుగా గాక, ఎంతో ప్రేమతో విశదీకరించారు. ఆ బాలుడు ఆ రోజు పొందిన సున్నితమైన ఉపదేశం అది.

ఈ సంఘటన 1920లో స్కందాశ్రమంలో జరిగింది. ఆ సాధువు మరెవరో కాదు. మహాజ్ఞానిగా విశ్వవిఖ్యాతి గడించిన శ్రీరమణ మహర్షి, అప్పటికి ఆయన వయస్సు 41 సంవత్సరాలు. ఆ బాలుడు, శ్రీభగవాన్ తమ్ముని ఏకైక కుమారుడు వెంకట రామన్. ముద్దుగా 'వెంకిటూ' అని పిలిచేవారు. ఆ వెంకిటూని నేనే. ఆ వృద్ధురాలు మా నాయనమ్మ. శ్రీభగవాన్ తల్లి అలఘమ్మాళ్. ఆ సంఘటన నా స్మృతిపథంలో నాటుకు పోయింది. నా పెదనాన్న (శ్రీ భగవాన్) గారు నాకిచ్చిన ఉపదేశం ఆ సమయంలో నాకు అర్థం కాలేదు. కానీ, తర్వాత నేను ఆశ్రమ ఆధిపత్య బాధ్యత తీసుకొన్న తర్వాత, ఆ ఉపదేశానికి అనుగుణంగా నేను జీవించే విధంగా ఆ సంఘటన ద్వారా నన్ను ఆయన దీవించారని నాకు అర్థమైంది.

కుంటి కోతి (నొండి) గురించి క్లుప్తంగా చెబుతాను. శ్రీభగవాన్ సామీప్యంలో నిత్యమూ ప్రకటితమయ్యే స్వతంత్రమూ, సహజత్వమూ వల్ల కొండమీదగానీ, కొండ క్రిందగానీ ఆవులు, కుక్కలు, కోతులు వంటి జంతువులు కూడా ఎంతో నిర్భయంగా ఆయనతో స్నేహంగా సంచరించేవి. ఈ విషయం ఆశ్రమ ప్రచురణల వలన మనం తెలుసుకోవచ్చును.



ఒకసారి, తన బిడ్డతోపాటు ఒక కోతి చెట్టుమీద ఒక కొమ్మ మీద నుండి ఇంకొక కొమ్మమీదకు దూకుతున్నపుడు, పట్టు వదలి తల్లినుండి పిల్లకోతి కిందకు పడిపోయింది. దాని లేత కాలు విరిగి పోయింది. ఆ బిడ్డను శ్రీ భగవాన్ సంరక్షించి, కాలుకు కట్టుకట్టి, కొంతకాలం వరకు దానికి ఆహారం ఇచ్చి సాకారు. కాలు నయమైందిగానీ కుంటితనం పోలేదు. అది అలాగే కుంటుతూ 'నొండి' అనే పేరుతో స్కందాశ్రమవాసులకు ప్రియమైన పెంపుడు కోతిలాగ సంచరించేది.

శ్రీభగవానుల భక్తులు తీసుకొని వచ్చే పండ్లుగానీ, మిఠాయిలుగానీ అప్పటికపుడే భక్తులందరికీ పంచబడేవి. నొండి చుట్టుపక్కల లేకపోతే కొంచెం భాగం అతని కోసం కిటికీ దగ్గర వుంచబడేది. తిరిగి రాగానే అది గెంతుకుంటూ వెళ్ళి శ్రీభగవాన్ నుండి తన వాటా ప్రసాదం తాను తీసుకు తినేది. దాని వాటా ప్రసాదం మీద నేను చేయి వేశాను కాబట్టి, నాకు దానినుండి చెంపదెబ్బ, శ్రీభగవాన్ నుండి ముద్దైన తిట్టు రూపంలో ఉపదేశమూ లభించాయి. నొండినుండిగాని, మరే ఇతర కోతి నుండిగాని అదే ఆఖరుసారి నేను దెబ్బ తినడం.

## 2. కుటుంబ పూర్వీకుల వివరాలు:

'నే నెవరిని?' అను ప్రసిద్ధమైన శ్రీభగవాన్ బ్రహ్మాస్త్రం నేను ఉపయోగించుట లేదు. మా ఇంటి వివరాలు కొన్ని తెలియ పరచాలని నా ప్రయత్నం.

మధురకు దక్షిణంగా, ఏభై మైళ్ళ దూరంలో తిరుచ్చుళి అనే చిన్న ఊరు వుంది. 19వ శతాబ్దపు రెండవ భాగంలో, అక్కడ శ్రీసుందరం అయ్యర్, శ్రీమతి అలఘుమ్మ అనే దంపతులు వుండేవారు. కాలక్రమాన కీర్తిశేషులైన వారు జగత్ ప్రసిద్ధులయ్యారు. వారి జీవితకాలంలో కూడా వారున్న ఆ చిన్న ఊరులో దాతృత్వానికీ, దయాగుణానికీ, ఆతిథ్యానికీ, శీల సంపదకూ వారెంతో పేరుపొంది అందరి మన్ననలూ చూరగొన్నారు. వారికి ముగ్గురు అబ్బాయిలూ, ఒక అమ్మాయి. నాగస్వామి, వేంకటరామన్, నాగసుందరం వారి మగసంతానం, అలమేలు వారి కుమార్తె. 1892లో సుందరం అయ్యర్ హఠాత్తుగా మరణించడం వలన, ఆయన తమ్ముడైన సుబ్బయ్యర్ నాగస్వామినీ, వేంకటరామన్‌నీ తనతోపాటు మధుర తీసుకు వెళ్ళారు. సుందరం అయ్యర్ చిన్న తమ్ముడైన నెల్లియప్పయ్యర్‌తోపాటు అలఘుమ్మ, నాగసుందరం, అలమేలు మధుర దగ్గరే వున్న మానామధురై వెళ్ళారు.

మధురలో చదువుకుంటున్నపుడు, వేంకటరామన్‌కు తన 16వ ఏట, మరణానుభవమూ, దానితోపాటు అతి శీఘ్రంగా ఆత్మ సాక్షాత్కారమూ కలిగాయి. అచిరకాలంలో ఇంటిని వదలి, 1896 సెప్టెంబరు 1వ తారీఖున ఆయన తిరువణ్ణామలై వెళ్ళిపోయి, 1950 ఏప్రిల్ 14న మహాసమాధి పొందేవరకు సహజనిష్ఠలో భగవాన్ శ్రీరమణమహర్షి పేరుతో వుండిపోయారు. దివ్య ప్రకాశ



వంతమైన ఆ సన్నిధిని, ప్రపంచంలో వున్న భక్తులందరూ తమ హృదయములలో సందర్శించి ఆనందించారు.

వేంకటరామన్ అన్నగారు నాగస్వామి పెళ్ళైన కొద్ది సంవత్సరములలోనే గతించారు. తమ్ముడు నాగసుందరం, కీలపసలైకు చెందిన సుందరం అయ్యర్‌గారి కుమార్తె మంగళంను వివాహం చేసుకున్నారు. ఆ దంపతులకు ఇద్దరు బిడ్డలు, కలిగారు. కానీ, పసితనంలోనే ఇద్దరూ మరణించారు. శ్రీభగవాన్ చెల్లెలు అలమేలుకు సంతానం లేదు. తమ వంశం తన బిడ్డలతోనే అంతమై పోతుందేమోనని అలఘుమ్మ బెంగ పెట్టుకుని, కోడలు మంగళంను తీసుకొని తమ కుటుంబ దైవమైన శ్రీవేంకటరమణున్ని దర్శించుకోవడానికి 1913లో తిరుపతి వెళ్ళారు. తిరుగు ప్రయాణంలో శ్రీభగవాన్ రమణ మహర్షిగా పేరుపొందిన తన కుమారుడు వేంకటరామన్‌ను చూడటానికి తిరువణ్ణామలైలో ఆగారు. ఆ సమయంలో శ్రీభగవాన్ విరూపాక్ష గుహలో వుంటున్నారు. "మన వంశం అభివృద్ధి చెందవద్దా? కొడుకు పుట్టాలని నీ తమ్ముణ్ణి దీవించు" అని అలఘుమ్మ శ్రీభగవాన్‌ను బలవంత పెట్టారు.

శ్రీ భగవాన్ చిరునవ్వును దివ్యకటాక్షంగా భావించి కోడలుతో మానామధురై వెళ్ళిపోయారు అలఘుమ్మ.

తిరుపతి, తిరువణ్ణామలైల దివ్యశక్తుల అనుగ్రహంతో 26 మే 1914న, మంగళం ఒక మగబిడ్డను ప్రసవించింది.

తిరుపతి మూలవిరాట్లు శ్రీవేంకటేశ్వరస్వామి పేరిట, శ్రీ భగవాన్ పేరు ప్రకారం, బిడ్డకు 'వేంకటరామన్' అని పేరు పెట్టారు. అందరూ ముద్దుగా 'వెంకిటూ' అని పిలిచేవారు. నేను పుట్టిన కొద్దికాలానికే నా తల్లి జబ్బు పడింది. మానామధురై తాలూకా కచేరీలో నా తండ్రి నాగసుందరం పనిచేసేవారు. మా అమ్మను, ఆమె దేహస్థితి వలన మా తాతయ్యగారింటికి తీసుకు వెళ్ళారు. నాకు తల్లి పాలు కరువయ్యాయి. మా పొలాలు చూసే, పిచ్చు వేదన్, నన్ను మరవర్‌లు వుండే వీధికి తీసుకుపోయేవాడు. అక్కడ మరవర్ స్త్రీలు తమ చనుబాలు నాకు ఇచ్చేవారు. మరవర్ జాతీయులు ధైర్య సాహసాలకు ప్రసిద్ధులు. నాకున్న స్థైర్యానికీ, పట్టుదలకూ కొంత ఆ పాలే కారణం అనుకుంటాను. నాకు మూడేళ్లు అయినా రాకముందే నా తల్లి కాలం చేసింది.

### 3. అలమేలు అత్తకు పెంపుడు కొడుకు:

శ్రీ భగవాన్ ఏకైక సోదరి అలమేలును కుంద్రాకుడికి చెందిన పిచ్చు అయ్యర్‌గారికి ఇచ్చి వివాహం చేశారు. వారికి పిల్లలు లేరు. తన స్నేహితులు, బంధువులు ఇచ్చిన సలహా మేర, నా తండ్రిగారు నన్ను వారి సంరక్షణలో వదిలిపెట్టారు. పిచ్చు అయ్యర్ అన్నగారి పిల్లలు, తరచు ఆయనను చూడటానికి వచ్చేవారు. ఆయనను 'చిన్నాన్నా' అని పిలిచేవారు. వారిలాగే నేను కూడా అలాగే పిలవ నారంభించాను. వారి పిల్లల్లో ఎవరినైనా పెంచుకోమని, ఆయన సోదరులు పిచ్చు అయ్యర్‌ను బలవంతపెట్టేవారు. ఇది విన్న శ్రీభగవాన్, 'ఎందుకు! వెంకిటూ అతని దగ్గరే వున్నాడు



కదా!' అన్నారు. ఇంట్లో నేనొక్కడినే పసివాడిని కాబట్టి, నన్నెంతో గారాబంగా చూసేవారు. వ్యాపారస్థుడుగా, పిచ్చు అయ్యర్‌కు ఆ ప్రాంతంలో మంచి పేరు వుండేది. సొంత బస్ సర్వీస్ వుండేది. వాడుకోవడానికి ఒక ఫోర్డు కారు వుండేది.

కుంద్రాకుడిలో కొండమీద సుబ్రహ్మణ్యస్వామి గుడి వుండేది. నన్ను తరచు ఆ గుడికి తీసుకు వెళ్ళేవారు. కొండమీద మెట్లు ఎక్కుతున్నపుడు, ఏనుగును కట్టివేసే ఒక షెడ్‌లో నుండి వెళ్ళవలసి వచ్చేది. ఆ ఏనుగుతో నిర్భయంగా ఆడుకోవడం నాకు బాగా గుర్తుంది. ఆలయంలో ప్రసాదం చేయటానికి కావలసిన సరుకులన్నీ మావయ్య కొట్టు నుండే వెళ్ళేవి. నేను ఎవరితో గుడికి వెళ్ళినా నాకు బోలెడంత ప్రసాదం పెట్టేవారు. గుడి నుంచి తిరిగి వెళ్ళేటపుడు నాకిచ్చిన ప్రసాదమంతా ఏనుగుకు పెట్టేసేవాడిని. అది తొండంతో తీసుకుని గుటుక్కుమని తినివేసేది. కొద్ది రోజులలోనే మేము మంచి స్నేహితులమైపోయాం. నేను నిర్భయంగా ఏనుగు కాళ్ళ మధ్య నుంచి పరుగెత్తేవాడిని, దాని తొండం నిమిరేవాడిని. చూసేవారికి నా ఈ ఆటలు అబ్బుర పరిచేవి.

మావటతను ఏనుగును స్నానానికి తీసుకు వెళ్ళేటపుడు, మా ఇంటిముందు ఆపినపుడు, తన రాక తెలపటానికి ఆ ఏనుగు తొండం ఎత్తి ఘీంకారం చేసేది. నేను పరుగున వెళ్ళిదానికి అన్నం, వడలు, అప్పాలు మొదలగు పదార్థాలు తినిపించేవాడిని. అవి తిన్నాకే ఏనుగు అక్కడనుంచి కదిలేది. *(సశేషం)*

# శ్రీ రమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# శ్రీ విశ్వనాథ స్వామి

మల్లాది ఫణిమాల

విశ్వనాథస్వామి 1904వ సంవత్సరంలో ఏప్రిల్ 21న శ్రీ రామస్వామి, అమ్మలు అమ్మ దంపతులకు జన్మించారు. శ్రీరామ స్వామిగారి తల్లి వారి చిన్నతనంలోనే మరణించడం చేత వారు, భగవాన్ తల్లితండ్రులైన శ్రీసుందరం అయ్యర్ మరియు అళఘమ్మ గారి వద్ద, తిరుచ్చుళిలో పెరిగారు.

వారి ఐదవ ఏట నుండి తొమ్మిదవ ఏట వరకు, విశ్వనాథ స్వామి, డిండిగల్‌లోని శృంగేరి మఠంలో రుద్రమును అధ్యయనం చేశారు. కౌమార దశలో విశ్వనాథస్వామి చురుకైన గాంధేయవాది. మదురై జిల్లా కాంగ్రెస్ కమిటీకి 18 రూపాయల జీతంతో కార్యదర్శిగా నియమింపబడ్డారు. వారు ఆ జీతానికి బదులు అచ్చటి ఆహారాన్ని స్వీకరించేవారు. కానీ 1921లో శ్రీ భగవానుల వద్దకు వచ్చినప్పటినుండి వారి ప్రభావం చేత విశ్వనాథస్వామివారి రాజకీయ కార్యకలాపాలు క్రమంగా బలహీనపడ్డాయి. 1922 నుండి 1950వ సంవత్సరం వరకు వారు శ్రీభగవానులతోను, శ్రీకావ్యకంఠ గణపతిమునితోను ఎక్కువ సమయం గడిపేవారు.

విశ్వనాథస్వామి తమిళ, సంస్కృత భాషలలో మంచి పాండిత్యము కలిగి ఉండేవారు. వారు శ్రీరమణాశ్రమం ప్రచురణలను ఇంగ్లీషు, సంస్కృతం నుండి తమిళంలోకి అనువదించడమే కాకుండ స్వామి రామ్‌దాస్, మహాత్మా గాంధీ



గారి ఎన్నో రచనలను కూడా అనువదించారు.

విశ్వనాథస్వామి భగవాన్‌ను మొట్టమొదటిసారిగా 1921వ సంవత్సరంలో, స్కందాశ్రమంలో చూశారు. ఆ కలయికను వర్ణిస్తూ, విశ్వనాథ స్వామి "అత్యంత శక్తిమంతమైన శ్రీభగవాన్ అనుగ్రహ వీక్షణం నా అహంకారాన్ని పూర్తిగా నిర్మూలించింది. నేను మొట్ట మొదట భగవాన్‌ను స్కందాశ్రమంలో చూడగానే, వారిలో ఒక గొప్ప సమ్మోహనశక్తి ఉన్నట్లు గ్రహించాను. నేను చూసిన ఇతరులందరికంటే వారు ప్రత్యేకంగా, భిన్నంగా నాకు తోచారు. భగవాన్ భౌతిక శరీరంతో సంబంధం లేకుండా, దాని నుండి విడిగా ఉన్నారు. వారి చిరునవ్వు మరియు చూపు ఒక విశిష్టమైన ఆధ్యాత్మిక సౌందర్యంతో వెలిగిపోతున్నాయి. ఆయన లోనూ, ఆయన కదలికలలోనూ మచ్చలేని పరిశుద్ధత, వైరాగ్యము స్పష్టంగా కనిపిస్తుండేవి. వారిని సమీపించగానే ప్రత్యేకమైన సంతోషం కలుగుతుంది కూడ. వారి సన్నిధిలో మానసిక అలజడి తగ్గిపోయి, మనసు నైతిక బలాన్ని పుంజుకొని ఎన్నడూ ఎరుగని శాంతిని ప్రత్యక్షంగా మనం అనుభవించగలుగుతాము. దీనిని నేను 'రమణ లహరి' అని అంటాను. అంటే శ్రీరమణుల దివ్య సన్నిధిలో వారి అనుగ్రహం వల్ల కలిగే పారవశ్యంలో ఏ వ్యక్తి అయినా, తన ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని కోల్పోతారు. అంతటా వ్యాపించి ఉండి, అందరినీ కబళించివేసే దివ్యశక్తి అచ్చట ఉంటుంది. ఆ అనుగ్రహ ప్రకాశంలో, ఈ జగత్తును మ్రింగివేయ

గల అరుణాచలేశ్వరుని శక్తియే అది''.

ఒకసారి శ్రీ నిరంజనానంద స్వామి ప్రోద్బలం చేత శ్రీ భగవానుల ముందు విశ్వనాథస్వామి కొన్ని సంస్కృత శ్లోకాలను పఠిస్తే, భగవాన్ విశ్వనాథన్‌తో, ''నువ్వు ఇవన్నీ నేర్చుకున్నావు. కానీ నేను ఏమీ నేర్చుకోలేదు. అరుణాచలానికి వచ్చే ముందు నేనేమీ నేర్చుకొననప్పటికీ ఏదో ఒక మహాద్భుత శక్తి నన్ను ఆవరించి, నాలో విపరీతమైన మార్పును తీసుకు వచ్చింది. మీ తండ్రిగారైన రామస్వామిగారు హిమాలయాలకు వెళదామని కోరుకున్నప్పటికీ, ఒక కుటుంబ పెద్దగా మారారు. ఏమీ ఎరుగని నేను అరుణాచలానికి లాగబడి, ఇచ్చట స్థిరపడడం జరిగింది'' అని అన్నారు.

అప్పుడు భగవాన్ విశ్వనాథస్వామికి 'శ్రీరమణగీత' గ్రంథాన్ని ఇచ్చి, దానిని వారి తండ్రిగారికి అందజేయమన్నారు. అందులోని 18వ అధ్యాయంలోని శ్లోకాలు చదివి, శ్రీరమణుల పాదాల చెంతకు చేరవలెనని ధృడంగా నిర్ణయించుకుని, జనవరి 2, 1923న వారు శ్రీ భగవానుల వద్దకు వచ్చి, వారి పాదాలను ఆశ్రయించారు. విశ్వనాథన్ ఇంటివద్ద ఎవరికీ చెప్పకుండా, ఇల్లు వదలి వచ్చేసినట్టు భగవాన్ గ్రహించి, తల్లిదండ్రులకు అరుణాచలంలో ఉన్నట్లు తెలియచేయమన్నారు. భగవాన్ సన్నిధిలో ఉండటాన్ని మించిన సాధన మరొకటి లేనేలేదని విశ్వనాథన్ తెలుసుకున్నారు. శ్రీభగవాన్ సహచర్యంలో ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని ఆశ్రమం పనులలో పాలుపంచుకునేవారు. భగవాన్



రచించిన సాహిత్య గ్రంథాలు అధ్యయనం చేస్తూ, సందర్శకుల ప్రశ్నలకు భగవాన్ ఇచ్చే సమాధానాలు విని, అర్థం చేసుకుంటూ విశ్వనాథస్వామి గమ్యాన్ని చేరే దిశలో కఠినతరమైన అభ్యాసాన్ని చేశారు. ఉన్నది నలుబది యొక్క అనుబంధంలో భగవాన్ వ్రాసినట్లుగా, మహాత్ముని సాంగత్యం పొందగలిగిన వారికి, మతపరమైన, ఆధ్యాత్మికపరమైన ఆచరణలేమీ అవసరం లేవని, విశ్వనాథస్వామి అర్థం చేసుకున్నారు.

''నాలో ప్రస్తుతం ఉన్న జంతుప్రవృత్తులని ఎలా అధిగమించగలను? ఆ దిశగా నేను చేసిన స్వంత ప్రయత్నాలన్నీ వ్యర్థమయ్యాయి. ఏదో ఒక మహత్తర శక్తి వల్లనే ఇది సాధ్యమని నా విశ్వాసం'' అని ఒకరోజు విశ్వనాథస్వామి భగవాన్‌తో అంటే, శ్రీ భగవానులు ఎంతో కరుణతో, ''అవును నువ్వు అనేది నిజమే. ఇంద్రియాలకంటే ఉన్నతమైన శక్తిని జాగృతం చేయడం ద్వారానే, వీటిని అణచవచ్చును. నువ్వు ఆ ఉన్నతశక్తిని జాగృతం చేసి బలోపేతం చేసినట్లయితే, మిగిలిన ప్రతి ఒకటీ దానికదే వెల్లడి అవుతుంది. ధ్యానాన్ని, అవిరామంగా, నిరంతరం కొనసాగించాలి. ఆహారనియమాలు, ఇతర నియమాలు శ్రద్ధగా పాటించడంవల్ల ఆంతరంగిక శాంతిని నిలుపుకోవడానికి వీలవుతుంది'' అని అన్నారు.

విశ్వనాథస్వామి అరుణాచలంకి చేరుకుని నాలుగు నెలలు గడిచిన తరువాత, వారి తల్లితండ్రులు భగవాన్‌ని దర్శించుకుని, విశ్వనాథన్‌ను తిరిగి ఇంటికి తీసుకుని వెళ్ళడానికి అరుణాచలం

వచ్చారు. కాని ఈ పనిలో వారు సఫలీకృతులు కాలేకపోయారు. కరుణాపూరిత గళంతో భగవాన్ రామస్వామి దంపతులను ఇలా సమాధానపరిచారు. "నిండు మనసుతో, సంపూర్ణ నమ్మకంతో విశ్వనాథస్వామి శరణాగతి బాటపట్టారు. అతను ఎంచుకున్న మార్గం అంతర్గతంగా ఎంతో మంచిది. అందుకే కొడుకును గురించి వారు ఆందోళన చెందవలసిన పనిలేదు" మనల్ని మనం భక్తి శ్రద్ధలతో, నిజాయితీగా సాధనకు అంకితం చేసుకుంటే, సద్గురు రమణులు మనందరికీ ఆధ్యాత్మిక పరిపూర్ణత సిద్ధింపచేస్తారనడం అక్షర సత్యం. "సాధకుని ప్రయత్నమూ, గురువు అనుగ్రహమూ రెండూ సమానార్థకములైనవీ, ఒకేసారి జరిగేవి" అనే భగవాన్ వాక్కులను మనం ఎల్లప్పుడూ మరచిపోకూడదు.

విశ్వనాథన్ అష్టావక్రగీతను తమిళంలోకి అనువదించారు. అంతేకాక స్వామి రామ్‌దాస్ రచించిన 'ఇన్ క్వెస్ట్ ఆఫ్ గాడ్' అనే పుస్తకాన్ని మధురమైన తమిళభాషలో తిరిగి వ్రాశారు. విశ్వనాథ స్వామికి గల సాహిత్య ప్రతిభను భగవాన్ గుర్తించి, ఆశ్రమానికి ఆసక్తికరమైన పత్రిక ఏదైనా వస్తే, వెంటనే వారికి కబురంపే వారు.

'టాక్స్ విత్ శ్రీ రమణమహర్షి', 'ఉపదేశసార భాష్య', 'ఫార్టీ వర్సెస్ ఇన్ ప్రెయిజ్ ఆఫ్ భగవాన్', కపాలిశాస్త్రి గారు రచించిన 'సత్ దర్శన భాష్యం' వీటన్నిటినీ విశ్వనాథస్వామి తమిళంలోనికి అనువదించారు. సంస్కృతములో వారు వ్రాసిన 'శ్రీరమణ అష్టోత్తరము' శ్రీ భగవాన్‌ను స్తుతిస్తూ వ్రాయబడినది. అందులోని



ప్రతీ నామమునకు గల ప్రాముఖ్యతను వివరిస్తూ శ్రీ రమణ అష్టోత్తరమునకు వ్యాఖ్యానం కూడా వ్రాశారు. విశ్వనాథస్వామి చివరి దశలలో 'మౌంటెన్‌పాత్' పత్రికకు సంపాదకులుగా కూడా వ్యవహరించారు. సంపాదకులుగా విశ్వనాథ స్వామి చేసిన సేవ, విశేషమైన భక్తి మరియు సమర్థతతో కూడినదిగా పేరు గాంచింది.

కౌమార దశలో శ్రీ భగవానులకు శరణొందిన విశ్వనాథస్వామి, 75 ఏళ్ళ వయసులో, అక్టోబరు 22, 1979వ సంవత్సరంలో, శ్రీ అరుణాచలేశ్వరుని యందు ఐక్యమొందారు.

విశ్వనాథస్వామి ఎంతో నీరసించిన శారీరక స్థితిలో ఉన్నప్పటికీ ఎవ్‌లిన్ కీస్లో గారికి ప్రతిదినము ఒక గంట సంస్కృతము బోధించెడివారు. ఆ సమయములందు ఆమె, "మీరు వ్రాసిన రచనలు వేటినైనా నాకు దయచేసి బోధించండి" అని ప్రాధేయ పడినప్పటికి, వారు శ్రీ భగవానుల రచనలు మరియు బోధల పట్ల మాత్రమే ఆసక్తి కనబరుస్తూ వాటినే వివరించేవారు. అందుకే శ్రీ విశ్వనాథస్వామి ఎంత ఉన్నతమైన సాధకులైనప్పటికీ వారు ప్రప్రథమంగా శ్రీ భగవానుల శిష్యులే! అని ఆమె ఎప్పుడూ చెబుతూ, విశ్వనాథస్వామి పట్ల ఆమెకు గల గౌరవభక్తులను సవినయంగా వ్యక్తపరచారు.

*(మూలం: అరుణాచలరమణ: ఎటర్నల్ ఓషన్ ఆఫ్ గ్రేస్, శ్రీరమణ మహర్షితో ముఖాముఖి.)*

# శరణాగతి - అంతరార్థం

అనువాదం: తాడిమేటి సత్యనారాయణ

(మౌంటెన్‌పాత్ (జులై-సెప్టెంబర్, 2018) సంచికలో శ్రీ నండూరి శ్రీరామమోహన్‌గారి వ్యాసం "యాన్ ఇన్‌సైట్ ఇంటూ సరెండర్" యొక్క అనువాదం)

**బాధలు - ఫలితాలు:**

మనం ఎల్లప్పుడూ ఆనందాన్ని, శాంతినీ కోరుకొంటామని శ్రీభగవాన్ అంటారు. కష్టాలను, బాధలను మాత్రం మనం వాంఛించము, నిరాకరిస్తాము. ఏమయినప్పటికీ, జీవితంలో ప్రతి యొక్కరు ఒక క్లిష్ట పరిస్థితిని ఎప్పుడో ఒకప్పుడు ఎదుర్కొనే వుంటాము. అట్టి పరిస్థితిని ఎదుర్కొనలేని నిస్సహాయ స్థితిలో వున్నప్పుడు దానికి పరిష్కార మార్గాన్ని వెంటనే వెదకుతాము. అంతేకాదు, ప్రశాంతమయిన ఒక సాయంసమయంలో కూర్చొన్నపుడు, అటువంటి బాధాకరమైన పరిస్థితి తిరిగి వస్తుందేమో, దానికి పరిష్కారమార్గం కనుగొనలేనేమో అనే ఆందోళన మనల్ని క్రుంగదీస్తుంది. మన నిస్సహాయత, పరిష్కారాన్ని కనుగొనలేని దీనావస్థలను గురించిన ఆలోచనలు మనలను చుట్టుముడుతాయి.

అలాంటి పరిస్థితులు, మనం ఎదుర్కొనే మానసిక వ్యథలు తిరిగి ఏర్పడకుండ అడ్డుకోలేమా? అడ్డుకోలేని స్థితి తప్పదంటే, ఫలితంగా కలిగే బాధలను ఎట్లాగ నిరోధించాలి? ఈ ప్రశ్నలకు సమాధానం కావాలంటే, అసలు బాధలకు హేతువు ఏమిటి? దానికి పరిష్కారమేమిటి? అని చర్చించాలి. పరిష్కారం ఒక్కటే.



ఇట్టి పరిస్థితిని ఎదుర్కోవాలంటే ఏకైక మార్గం ''సంపూర్ణ శరణాగతి''. అంటే మన అహంకారాన్ని భగవంతునికి, లేదా గురువునకు లేదా ఆత్మకు అర్పించుకోవటమే.

మనకు గాయాలు తగిలినప్పుడు లేదా అనారోగ్యంగా వున్నప్పుడు శారీరకంగా నొప్పులను అనుభవిస్తాము. అనంతరం అవి దుఃఖాన్ని కలిగిస్తాయి. ఇక శరీరానికి నొప్పులు లేనప్పటికీ, మానసిక వ్యథలకు మాత్రం లోనై బాధపడతాం. భగవాన్ శరీర యాత్రలో జరిగిన రెండు పరిస్థితులను ఇక్కడ గమనించాలి. ఒకటి, వ్యథ తాత్కాలికమైనప్పుడు సమస్య కొద్ది కాలం మాత్రమే వుంటుంది. బాధ కూడా కొద్ది సమయమే. రెండవది, దీర్ఘకాల వ్యథలు. అంటే నెలల తరబడి మనిషిని క్రుంగదీసే బాధలు. ఫలితం అసాధారణమనిపిస్తుంది.

**భగవాన్ జీవితంలో సంఘటనలు :**

మొదటి సంఘటన భగవాన్ యొక్క మరణానుభవం. తీవ్రమయిన మరణభయం ఏర్పడినప్పుడు, వారు ఆ భయాన్ని ప్రతిఘటించలేదు, దానికి పరిష్కారం తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. భయం పుట్టింది, 'సరే' అని స్వీకరించారు. అసలు ఆ భయం ఏమిటో తెలుసుకొనడానికి ప్రయత్నించారు. దృఢంగా, తాను మరణిస్తున్నామని తెలిసి కూడా పరిష్కారాన్ని వెదకక ఉన్నటువంటి స్థితిని స్వీకరించారు. తమ నిత్యశాంతికి మూలమేదో దానిని తెలుసుకొన్నారు. ఈ భయమున్నంత సమయం వారిలో ''భగవంతుడు'' అనే తలపుగాని, ''శరణాగతి''

అనే ఆలోచనగాని కలుగనే లేదు. ఇక్కడ గ్రహించవలసినదేమంటే "ఇష్టములేనిదయినా, అంగీకరించలేనిదయినా ఉన్నటువంటి యథాతథ స్థితిని స్వీకరించడమే". అపుడే బాధలనుండి విముక్తి చెందగలమని శ్రీభగవానుల బోధ.

ఇక రెండవ బాధాకర పరిస్థితి భగవాన్‌కు ఎదురయింది. ఎడమ చేతి భుజానికి వచ్చిన సర్కోమా వ్యాధి. తీవ్రమయిన వ్యాధి అని ఎవ్వరూ మొదట అనుకోలేదు. భగవాన్‌కు ఇష్టం లేకున్నా వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. ఆ సమయంలో శస్త్ర చికిత్సను అంగీకరించారు. ఆ పుండుకు శస్త్ర చికిత్స అంటే ఎంతో నొప్పితో కూడినది. కాని భగవాన్ ఆ నొప్పిలో కూడా ఎటువంటి బాధను కనబర్చలేదు. నొప్పి వుంది. కాని నొప్పి వారిది కాదు. నొప్పిని భరించడం, లేదా బాధపడడం శరీర లక్షణం. దానికి ఋజువు వారి ముఖంలో కనబడిన గంభీరమైన ప్రశాంతత. ఈ ప్రశాంతతనే భక్తులు వారి సమక్షంలో పొంది అనుభవించేవారు. ఇదే శరణాగతి. దానికి భగవాన్ ఒక సజీవ తార్కాణము. ఈ శరణాగతి తత్త్వాన్నే వారు 'సద్విద్య'లో రెండవ శ్లోకంలో వివరించారు:

> మరణభయమధికమైన యీ పురుషులు భవ మరణ రహితమగు మహేశ్వరుని చరణములనే శరణముగఁ బొందగలరు. తమ సంగములతోఁ దామును తమ అహం బుద్ధియు జచ్చి అనగా మమతాహంకారములు నశించి చావులేక స్వరూపమై వెలుగువారు మరల మరణచింతనొందగలరా!



**శరణాగతికి తగిన లక్షణాలు:**

సాధారణంగా బాధలు అనుభవిస్తున్నప్పుడే బాధలు లేని సుఖం యొక్క విలువను గుర్తించగలం. సర్వశక్తిమంతుడగు భగవంతుడు ఒక్కడే అట్టి సుఖాన్నివ్వగలడని నమ్మకం ఏర్పడుతుంది. బాధల నుండి విముక్తి చెందడానికి చేసే ప్రయత్నంలో తనకున్నటువంటి విలువైనవన్నీ భగవంతుని కరుణకు అర్పించడానికి వెనుకాడం. అదే ఆ శ్లోకం యొక్క భావం. అందులో ఈశ్వరుడు, వారి లక్షణాలను కీర్తించి శరణు పొందడమే భగవాన్ వివరించారు. అంటే, మొదట వ్యక్తి శరణాగతి చెందటానికి తగిన యోగ్యత కలిగి వుండాలి. యోగ్యత అంటే 1. ఈ లోకంపై వైరాగ్యము, ముముక్షత్వమును కోరడం. 2. బాధల నుండి విముక్తి పొంది శాశ్వతానందాన్ని పొందడం. 3. శరణాగతికీ, పరమానందానికీ వుండే సంబంధము తెలిసి వుండడం అంటే శరణాగతి, పరమానందం రెండూ ఒకే అర్థాన్నిచ్చే పదాలని తెలిసివుండడం. దాని ఫలితమైన పరమానందం శాశ్వతమని, ఇప్పుడే ఇక్కడే వుందన్న జ్ఞానం కలిగివుండడం.

"శ్రీమహర్షులతో సంభాషణ" అనే గ్రంథంలోనే భగవాన్ ఇంకా ఇలా అంటున్నారు. "ప్రతి యొక్కరూ ఎప్పుడో ఒకప్పుడు మరణించవలసిందే కాని దాని గురించి ఎవ్వరూ తీవ్రంగా ఆలోచించరు. అందరికీ మరణ భయం వుంటుంది. ఆ భయం క్షణికం. ఇక భయమెందుకు? భయానికి కారణం "నేను ఈ దేహం" అనే భావన. శరీర మరణానంతరం ఆ శరీరాన్ని దహనం చేయటం

అందరికీ తెలిసిన విషయమే కదా! మరణం అంటే దేహం నశించట మనే విషయం అందరికీ తెలిసినదే. శరీరమే నేను అనే భావం వున్నప్పుడు మరణం అంటే తానే పోతున్నాననే భయం ఏర్పడు తుంది. జనన మరణాలు కేవలం దేహానికే పరిమితమైనవి. కాని జనన మరణాలు ఆత్మకు సంబంధించినవన్న భ్రమలో వుంటారు.

**శరణాగతి జనన మరణ వలయం నుండి విముక్తి:**

ఈ విషయంపై భగవాన్ ఇలా అన్నారు: “జనన మరణ వలయం నుండి బయటపడాలనే ప్రయత్నంలో మనిషి తనను రక్షించమని భగవంతుని ఆశ్రయిస్తాడు. అపుడే భగవంతునిపై అతడు భక్తి, నమ్మకాన్ని పెంచుకొంటాడు. మరి భగవంతుని ఎట్లాగ ఆరాధించాలి? జీవుడేమో బలహీనుడు, సృష్టికర్త శక్తిమంతుడు. అట్టి శక్తిమంతునిని ఎట్లాగ ఆశ్రయించాలి? దానికి సమాధానమొక్కటే! తనను భగవంతునికి అర్పించుకొనడం తప్ప మరొక మార్గం లేదు. అంటే, సంపూర్ణ శరణాగతి ఒక్కటే మార్గము. శరణాగతి అంటే తన సొంతం అనుకొన్నవన్నిటినీ ఆ కరుణామూర్తికి అర్పించుకొనడమే. సమస్తం అర్పించిన తర్వాత అటుపై అతనికి మిగిలివున్నది ఏది? ఏమీ లేదు. తను లేడు, తన సొంతమంటూ ఏదీ లేదు. ఒకమారు తనను భగవంతునికి అర్పించుకొన్న తర్వాత మనిషి చింతించాల్సిన పని లేదు. ఇక జనన మరణాలు అతనిని భయపెట్టలేవు. భయానికి కారణం ఈ శరీరమే. శరీరం తనది కానే కాదు. ఇక అతనికి భయ



మెందుకు? భయపడటానికి ఒకడున్నాడా? ఈ విధంగా ఆత్మను సాక్షాత్కారించుకొని పరమానందంలో మునుగుతున్నాడు” అని భగవాన్ బోధించారు.

ఒకటి మాత్రం గ్రహించాలి. ఈ విశ్లేషణ ద్వారా రోగభయంతో సహా సకల భయాలు, తన సొంతమనుకొన్నవి పోవడం, ఇవన్నీ వ్యక్తి తన ఉనికిని పోగొట్టుకొనడమేనని విశదమౌతుంది. శ్రీ భగవాన్ ఇంకా ఇలాగన్నారు “సర్వమూ నీవే, అంతా నీ ఇచ్ఛయే, నీ సంకల్పమే” అనే స్థితికి చేరుకొనడమే శరణాగతి”. ఈ దశ జ్ఞానము కంటె వేరు కాదు. ఇదే అద్వైత భావం. యథార్థంగా ద్వైతము లేదు, అద్వైతమూ లేదు. ఉన్నది ఏదో అదే. శరణు పొందడం, చాలా సులభమనిపిస్తుంది. దానికి కారణం మనిషి “నేను శరణొందాను” అని నోటి మాటతో చెప్పి, అటుపై తన భారాన్నంతా భగవంతునిపై మోపి, ఇక తాను విముక్తుడనని, తాను ఏ పనినైనా చేయవచ్చునని భావిస్తాడు. కాని నిజమేమంటే ఒక మారు శరణొందిన తర్వాత అతనికి ఎలాంటి ఇష్టా యిష్టాలుండవు. అతని సంకల్పము పూర్తిగా తొలగిపోవాలి. అపుడు ఆ స్థానాన్ని భగవంతుడు భర్తీ చేస్తాడు. అహంకార నాశమూ, జ్ఞానమనినా రెండూ ఒకటే. అందుకే వ్యక్తి, ఏ మార్గాన్ని అనుసరించినా, చివరకు జ్ఞానమునకు లేదా ఏకత్వానికి రావలసినదే. *(సశేషం)*

## “Reflect On My Teachings and Do What You Like!”

Dr.K.Subrahmanian (Talk No.51A)

Religious books tell us that we will go to heaven if we think of God or utter His name in our last moments. But it is the most difficult thing to do. When the fear of death overtakes us, our attention will be on how to get out of the situation, on how not to succumb to death. Thinking about Him and at that time is not possible unless we have been thinking of Him all the time. We all know we will die one day, but we think it will happen several years later.

Young people never think of death. You start thinking about death often as you grow older. You see your friends and relatives passing away, and then you are reminded about death on those occasions. Still,you don’t think it is a very natural thing and that you must accept it. We all resist it because however miserable and difficult life may be, we want to continue since we know what life is; but,we do not know what death is. There is the fear of the unknown. We prefer to cling to what is known, rather than jump into the unknown. Only people who are very serious are interested in finding out the truth about death.Buddha, Nachiketas, and Bhagavan wereamong the few who faced death squarely. When Bhagavan felt he was dying, he never called for any doctor, but he faced it squarely and the result was that he conquered the fear of death. He realized that death was to the body, not to the soul, and this was not just an intellectual understanding. We all know this theoretically, but we don’t have that experience. We feel that death is the cessation of everything, and therefore there is fear. Death stares at us in the face, but we avoid thinking about it.



When Yudhisthira was asked by the *Yaksha,* “What is the strangest thing in this world?”, he said, “Human beings see death all around all the time, and yet, each one wants to remain in this world forever.”

अहन्यहनि भूतानि गच्छन्तीह यमालयम् ।
शेषाः स्थावरमिच्छन्ति किमाश्चर्यमतः परम् ॥

*Ahanyahani bhutani gachanteeha yamaalayam ;*
*Seshah sthavaramicchanti kimaascharyamatah param*

The scriptures say many such things, but we wonder whether these could be true. And we give our own reasons for not developing any conviction about these utterings.

Arjuna did not want to kill his relatives, his gurus and elders to win the kingdom. Krishna said to him,“It is your *dharma* to protect truth. There is no question of attaching yourself to *adharma*. Your job now is to fight evil. Your attachment for people should not stand in the way. When you fight, you are doing your duty and you can’t make a distinction between friend and foe.”

For example, you are an officer and one of your close friends has done something very wrong. You feel sorry and try to find out various ways in which he can be saved. Finally, when you find that there is no way to save him, and if you are a good officer, you give reluctantly whatever punishment he needs to be given. But when it is a person with whom you have no connection, you say straight away he must be punished. You say it is your duty and that is why you are doing it. Krishna says, “It is your duty to do it, and you should do it whether the person you are dealing with is a friend or a stranger.”

Who is Krishna? He is the Lord of the universe, but he humbly took up the job of driving the chariot of Arjuna – he chose to be the *sarathi*, the driver for Arjuna. Humility of this kind is possible only if you have no ego of any kind whatsoever. Bhagavan submitted to the regulations of the *ashram*. He never said, "It is my *ashram*, I will do as I please!" The *ashram* people said Bhagavan would be available at such and such time; he agreed to this, and made himself available. He never said it is a nuisance. That kind of humility is possible if you are at the level of Bhagavan.

